# మహా యోగిని ఊర్మిళ

Dr.S.Ramadevi
Associate professor in Sanskrit
Sri Ramachandra Arts and Science College, Hyderabad

వాల్మీకి హృదయాన్ని ఆవిష్కరించిన రామాయణాలలో , ప్రధాన కథను , పాత్రలను వక్రీకరించకుండా కొంత మేరకు కథలో సంఘటనలలో కొన్ని మార్పులు చేర్పులు చేసినా, ఆ మహాకావ్యం యొక్క ఆత్మను మనోజ్ఞంగా ఆవిష్కరించిన రచన విశ్వనాథ సత్యనారాయణ కల్పవృక్షం . రామస్య అయనం అంటూ రాముడి కథ చెప్పిన వాల్మీకి సీతాయాః చరితమ్ అని కూడా అన్నాడు అంటే రామకథతో పాటుగా సీత కథ కూడ అల్లుకుపోయి ఉంది అని తెలుసుకున్న రామకథ వ్రాసిన కవులందరి లాగానే విశ్వనాథ సత్యనారాయణ కూడ అంతే ప్రాధాన్యత తో సీత కథను చెప్పడం చూస్తాం . అయితే సీతతో పాటు అంతే విశిష్టత కలిగిన పవిత్ర ధర్మమూర్తి, ఒక మహా తపశ్శాలి, తేజోమయమైన శక్తి ఊర్మిళ పాత్ర చిత్రణ లో కవి విశ్వనాథ సత్యనారాయణ కనపరచిన ప్రతిభ అతి మనోజ్ఞం. మిగతా రామాయణాలన్నీ,
బహుశా అన్ని తెలుగు రామాయణాలూ, ఊర్మిళపై చూపిన జాలి, దయ,సానుభూతి అలవికానంత. ఊర్మిళ గురించిన ప్రస్తావన వాల్మీకి రామాయణంలో ఒక్కచోట మాత్రమే కనిపిస్తుంది. సీతను రాముడికిచ్చి పెళ్ళి చేసినప్పుడు సీత చెల్లెలయిన ఊర్మిళను లక్ష్మణుడికిచ్చి పెళ్లి చేశారు అని వాల్మీకి రామాయణంలో ఉంది. ఆ తరువాత మరెక్కడా ఆమె ప్రస్తావన రాదు. వాల్మీకి వదిలేసినట్లు అనిపించిన ఊర్మిళని తెలుగు ఆడవాళ్ళు తమ హృదయానికి దగ్గరగా తీసుకున్నారు. ఆమెను గురించి మహా అందమైన కథ అల్లారు. ఆకథలో రాముడితో పాటు అడివికి సీత వెళ్ళిపోతూంటే ఊర్మిళ కూడా లక్ష్మణుడితో పాటు వెళ్తానంటుంది. కాని లక్ష్మణుడు దానికి అంగీకరించడు. అలా ఒంటరిగా వదిలివేయబడ్డ ఊర్మిళా దేవి , అడివికి వెళ్ళిపోతున్న లక్ష్మణుడూ ఒక ఒప్పందం చేసుకుంటారు. ఈ ఒప్పందం ప్రకారం లక్ష్మణుడు తన నిద్రని ఊర్మిళకిస్తాడట . ఊర్మిళ తన మెలకువని లక్ష్మణుడికిస్తుందిట . తన భర్త అడివిలో ఉన్న పధ్నాలుగేళ్ళూ ఊర్మిళ నిద్రపోతుంది. లక్ష్మణుడు ఆ పధ్నాలుగేళ్ళూ పూర్తిగా మెలకువగానే ఉంటాడు. ఊర్మిళ భర్తృవిరహాన్ని అనుభవించనక్కర్లేకుండా, లక్ష్మణుడు తన భార్య జ్ఞాపకాన్ని మరిచిపోనక్కర్లేకుండా ఈ చమత్కారమైన ఊహ చేశారు తెలుగు ఆడవాళ్ళు. ఎవరి గుర్తింపూ పొందకుండా చరిత్రలో నిలిచిపోయిన ఊర్మిళ అంటే మనకు ఎంత ప్రేమా సానుభూతో చెప్పలేము. మన దృష్టిలో ఆమె ఒక నిస్సహాయురాలు. భర్త ప్రేమాదరాలకు నోచుకోని దురదృష్టవంతురాలు. కానీ దీని వెనుక ఉన్న నిజానిజాలు, అసలు కారణాలు, పైకి నిష్క్రియాత్మకంగా కనిపిస్తూ నిద్రాదేవి ఒడిలో సేదదీరుతున్న ఊర్మిళ ఒక మహా శక్తి ఆ విధమైన ప్రకటన చేసిన ఘనత కవి విశ్వనాథ సత్యనారాయణ

గారిది. కవిః క్రాంతదర్శి. ఆయన చూడని పార్శ్వం ఉండదు. తన భర్త లక్ష్మణున్ని , నిరాటంకంగా అన్న ధర్మపాలనలో వెన్నుదన్నుగా నిలిపిన ఘనత ఈ ఊర్మిళదే అని అవగాహన కలిగిన కవిగాబట్టేమో ఆమె పట్ల వాల్మీకి కనబరచిన నిర్లిప్తత, ఉదాసీనతలను పూరిస్తూ ఆమెను అంత అబలనుగా, అసహాయురాలిగా, దీనురాలిగా చూడలేని మన బాధను అర్థం చేసుకున్నవాడై విశ్వనాథ, మన ఎవరి ఊహకూ అందనంత ఎత్తులో నిలిపారు. ఊర్మిళ అంటే సాక్షాత్తు కుండలినీ శక్తి అని ప్రతిపాదించిన మహోన్నత కవి విశ్వనాథ సత్యనారాయణ. కవి అన్యాయంగా అన్నకు వనవాసం విధించబడిందనీ, అన్న ఎవరినీ ప్రతిఘటించకుండా ఆమోదించాడని కోపంతో ఊగిపోతూ, ఆక్రోశం ఆవేశం ఒకవైపు పీడిస్తుండగా, తను కూడ అన్నతో వనవాసానికి వెడుతున్నానన్న ఏకపక్ష నిర్ణయం తీసుకున్న విషయం భార్యకు చెప్పడానికి ఆమె దగ్గరకు వెళ్తాడు లక్ష్మణుడు. మనసులో వంద ఆలోచనలు, భయాలు. అనుమతి ఇస్తుందో లేదో ఒకవేళ తనూ వెంట వస్తానని వెంటబడితే గట్టిగా మందలించి వద్దు అని చెప్పి ఆపడమెట్లా , ఇట్లాంటి ఆందోళనలతో వెళ్ళిన లక్ష్మణుడికి భార్య సమక్షంలో ఎదురైన అనుభవం చిన్నదేం కాదు, ఒక్కసారి ఒంట్లోని రక్తనాళాలన్నింటినీ సంచలనానికి గురిచేసేంత. అటువంటి ప్రలయ సదృశ సందోహంలో వచ్చిన భర్త కోపం ఆవేశం ఎట్లా చప్పున చల్లబడ్డాయో, అణుమాత్రం మిగలకుండా మటుమాయం అయాయో ఒక్క ఊర్మిళకే తెలుసు. ఎందుకంటే లక్ష్మణుడు తన గృహమనుకుని వెళ్ళింది ఒక ఆశ్రమానికి కనక . అటువంటి ప్రశాంత వాతావరణ వలయంలోకి అడుగుపెట్టిన లక్ష్మణుణ్ణి ఒక్క క్షణంలో ఎక్కడలేని ప్రశాంతత ఆవహించింది.

మహా శాంతవంతుడై" కైకమ్మ వరము కోరెను, శ్రీకాంతుడు వనములందు జేరనె కోరెన్ భూకాంతాసుతయును దా నై కాంతారమ్మ పోవనై యాసించెన్; నేనుం బోవుచునుంటినే యడవికిన్ " అంటూ మెల్లగా అసలు విషయాన్ని ప్రస్తావిస్తాడు.

భర్త తనను సమీపించి ఈ విషయమంతా తనకు చెప్తున్న సమయంలో ఊర్మిళ ఒక మృగచర్మంపై కూచుని అరమూసినకన్నులతో సమాధి స్థితిలో ఉంది. కళ్ళు తెరిచిచూసి కళ్ళతోనే , ఒక చిన్న చిరు హాసంతో తన ఆమోదాన్ని ప్రకటించి మళ్ళీ సమాధిలోకి వెళ్ళిపోతుంది. విషయం ప్రస్తావన చేసి "లక్ష్మీనారాయణుల సేవ యేపగిదిగా జేయంగౌనో ఊర్మిళా" అని భర్త అడిగిన ప్రశ్నకు సమాధానం అతనికీ సమాధి స్థితిలో దొరుకుతుంది, భార్య యోగ ప్రభావంచేత. ఎంత అద్భుతమైన సన్నివేశాన్ని కల్పించాడో కవి ఈ సందర్భంలో. ఆ సమాధిస్థితిలో, లక్ష్మణుడికి విశ్వామిత్రుడుపదేశించిన బలాతిబల దేవతల అనుగ్రహం వలన ఆకలిదప్పులను, నిద్రను జయించి, వెన్నెలతో నిండిన అడవులలో తిరుగుతున్నట్లు అనుభవమవుతుంది. కళ్ళు తెరిచి లక్ష్మణుడు అయోమయంలో ఉన్నట్లు "మొదలు తెలిస్తే కదా తుది తెలిసేది" అని పలవరిస్తుంటే, "యోగిజనౌఘ! సంసదుదితిజ్జ్వల సత్రప్రథమావతార " అంటూ సంబోధించి అతనిలో బల అతిబల విద్యలను ఆవాహనం చేసి ఆ స్ఫూర్తి తనకు ఉన్నదన్న ఆలోచన ఆయనకు కలిగించి , ఆ విధంగా తను

నేర్చిన విద్యల స్ఫురణ అతనికి కలిగించి అవి వెలుగులోకి తెచ్చుకుని ఆ విద్యలకు సార్థకత తన ప్రయోజనం సిద్ధించేవిధంగా తమ రాబోవు వనవాసంలో వాటి ఉపయోగాన్ని తెలియజేసి, నారాయణ స్వరూపుడైన రాముడికి, పూర్వ జన్మలో కర్మయోగిగా ఆదిశేషువై సేవించిన విధానం స్మరణకు తెప్పించి, రాబోయే కాలంలో అదే కర్మయోగం అవలంబించే శక్తిని ప్రసాదించిన మహా యోగిని ఊర్మిళని పరిచయం చేసే పద్యం ఈ పద్యం.

"ఉరకన్ జ్ఞానపథంబులన్ దిరిగె నేవో నూత్న నిర్మాణవై
ఖరి గాంతారమునందు లక్ష్మణుడు రాకాజ్యోత్స్నలో నూరకే
తిరుగన్ వెంటనురా బలాతిబల లాదేశించు గాధేయ స
త్కరుణామూర్తులు క్షుత్పిపాసలను నిద్రాదేవి శాసించుచున్. "

ఈ విధంగా చిత్రీకరించబడిన ఊర్మిళ పాత్ర ఉదాత్తత, ఆమె వాల్మీకి రామాయణంలో నిర్లిప్తతకు గురయిందన్న మన బాధను మరిపింపచేస్తుంది. బాధా తప్త మన మనసులకు మంచి సమాధానం అవుతుంది. మరవకూడని మహత్వం కలిగిన, మధురఫలాల నందించిన, సీతారామలక్ష్మణులచేత రాక్షస సంహారం చేయించిన , ఎందరో స్త్రీమూర్తులను పూయించిన కల్పవృక్షాన్ని మనకందించి మహోపకారం చేసిన మహోన్నత శిఖరాలనంటిన ఋషి వంటి కవి, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ . అనంతమైన విలువలు కలిగిన ఆ కవి ఋషి సాహిత్యానికి కైమోడ్పులతో స్వస్తి.

1. శ్రీమద్వాల్మీకిరామాయణం పుల్లెల శ్రీరామచంద్రుడు
ఆర్షవిజ్ఞానట్రస్ట్, హైదరాబాదు

2. శ్రీమద్వాల్మీకిరామాయణోపన్యాసాలు శ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు
పద్మిని పబ్లకేషన్స్, విజయవాడ.

3. సంస్కృత సాహిత్యేతిహాసము ముదిగంటి గోపాల్ రెడ్డి
తెలుగు విశ్వవిద్యాలయము